నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 10, 2023 | www.navatelangana.com

పలు కుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ పరామర్శ

- ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కెఆర్‌కె కాలనీలో గల యాదగిరి లక్ష్మణ్, షేక్ అభి, మోహిత్ యాదవ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు ఉన్నారు. ఈ విషయం మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో వారి కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి సందర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆర్థిక సాయంగా కుటుంబానికి రూ.5000 చొప్పున రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆశన్న, మాజీ ఎంపిటిసి సంతోష్, ఆనంద్, కుర్ర నరేష్, సయ్యద్ చోటు, సాజిద్, సురేందర్ ఉన్నారు.



శిఖర్ కైలాష్ టెక్డి ఆలయ రోడ్డుకు రూ.12.60 కోట్లు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నిగిని నుండి కైలాష్ టెక్డి ఆలయం వరకు బిటి రోడ్డుకు రూ.12.60 కోట్లు మంజూరయ్యాయని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని కేటీఆర్ చేతుల మీదుగా జీఓ పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నో సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేక ఎదురు చూస్తున్న రోడ్డుకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసిఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అటవీ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, రాథోడ్ బాపురావ్‌కు అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ భాషాభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాష అభ్యసన అభివృద్ధి సమితి ఆవిర్భావ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కథ రచయిత బి.మురళీధర్, వ్యాసకర్త రాజవర్ధన్, పద్య కవి రంగాచార్య, తెరవే అధ్యక్షులు నారాయణగౌడ్, రాష్ట్రస్థాయి విషయ నిపుణులు పసుల ప్రతాప్ హాజరయ్యారు. కార్యక్రమ విశిష్టతను తెలియజేస్తూ భాషాభివృద్ధికై అందరూ కంకణబద్ధులై ఎలా ముందుకు పోవాలో వివరించారు. ఈ సమితి ద్వారా భాషాభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుదల, తరగతి గదిలో భాషాపరంగా జరిగే ప్రయోగాలను ప్రోత్సహించడం, వెలికి తీయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం జిల్లా స్థాయి సమన్వయకర్తగా చిందం ఆశన్నను, సహ సమన్వయకర్తగా వేణుగోపాల్‌ను, సభ్యులుగా టి.చరణ్‌దాస్, సిహెచ్ పొచ్చన్నను ప్రకటిస్తూ మండల స్థాయి సమన్వయకర్తలుగా 10 మండలాలకు ప్రకటించారు. కార్యక్రమంలో పది మండలాల తెలుగు పండితులు, భాష సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు



నవతెలంగాణ-చెన్నూర్

పెండింగ్ డిఏ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంవత్సరాల తరబడి జరిగిన పోరాట ఫలితంగా ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీలు, పదోన్నతులను పూర్తి చేయాలనే సంకల్పానికి రావడాన్ని స్వాగతిస్తున్నామని, స్పౌజ్, ప్రిఫరెన్షియల్ కేటగిరీలను అర్హులైన వారు మాత్రమే ఉపయోగించుకోవాలని, అక్రమమని తేలితే తీవ్రంగా నష్టపోతారని, ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. పదోన్నతులు, బదిలీ లలో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా అధికారులు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు భారతీ అశోక్, ఎంవిఎం గోపాలరావు, కొట్టె నాగరాజు, సింగిరెడ్డి సాంబయ్య, మండల నాయకులు దుర్గం చందు, చకినారపు ప్రవీణ్ లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాబోయే 4 నెలల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బేల మండలం పలాయి తండా గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావించిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదని తెలిపారు. ఇల్లు లేని పేద వాళ్లకు ఇల్లు కట్టిస్థామని, రైతులకు రుణమాఫీ చేస్తామని, దళితున్ని ముఖ్య మంత్రి చేస్తామని, దళితులకు మూడెకరాలు ఇస్తామని చెప్పిన హామీలన్నీ మాటలకే పరిమితం అయ్యాయన్నారు.

సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని లంబాడీ తండ(డి) గ్రామ పంచాయతీలో సేవాలాల్ సేన 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజుకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ మల్లేశ్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర నాయక్, పాలిత్య శ్రీనివాస్, అక్కునాయక్, భీమా నాయక్, రాజు, రవి పాల్గొన్నారు.

ఇదే తరుణం..పోరాటం చేద్దాం..!

- ఒప్పంద..కాంట్రాక్టు ఉద్యోగుల నిరసనల హోరు
- సమస్యల సాధన కోసం పోరుబాటలోకి సంఘాలు
- ఇప్పటికే కొందరు సఫలం ..మరికొందరిదీ అదే ఆశ
- రేపటి నుంచి సమ్మెలోకి అంగన్‌వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు
- ఎన్నికల ముంగిట సర్కారుకు ప్రతిబంధకంగా పరిణామాలు

సమస్యల సాధనే ధ్యేయంగా ఒప్పంద, కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన బాట పడుతున్నారు. ఏండ్లుగా పోరాడుతున్నా సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి. అడపాదడప సమ్మెలు..నిరవధిక దీక్షలు చేపట్టినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఇక తాడోపేడో తేల్చుకోవాలనే ఉద్దేశంతో పోరుబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని సంఘాలు ఈ పోరాటంలో సఫలం కాగా.. మరికొన్ని సంఘాలు అదే ఆశతో ఉన్నాయి. పోరాడితే తప్పక విజయ వరిస్తుందని భావిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఆరు కాలంలో ఈ నిరసనల హోరు మరింత అధికమయ్యాయి. ఒప్పంద, కాంట్రాక్టు ఉద్యోగసంఘాలే కాకుండా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఇదే బాటను అనుసరించాయి. వీరితో పాటు పలు కుల, ప్రజాస్వామ్య సంఘాలు సైతం పోరాటమే శరణ్యమని భావించి కదనరంగంలోకి దూకుతున్నాయి. రాష్ట్రంలో..జిల్లా కేంద్రాల్లో ఎన్నికల ముగింట తలుగుతున్న ఈ నిరసన సెగలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతోందనే వాదన వినిపిస్తోంది. తాజాగా సోమవారం అంగన్‌వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు వెళ్లడం మరింత సమస్యగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సమస్యల పరిష్కారం కోసం వివిధ సంఘాలు నిరసన బాట పడుతున్నాయి. ప్రభుత్వ ఒప్పంద, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాలతో పాటు కుల సంఘాలు, ప్రజా సంఘాలు ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ మరింత అధికమవుతున్నాయి. గత ఆరు నెలలుగా వివిధ సంఘాలు నిరసన తెలిపి సమస్యలను సాధించుకోగా.. మరికొన్ని అదే బాటను అనుసరిస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా దిగొచ్చి పరిష్కరిస్తుందనే ఉద్దేశంతో పోరుబాటను ఎంచుకుంటున్నాయి. ఇది వరకు అడపాదడప ఉద్యమాలు చేపట్టినా అంతగా ఫలితం కనిపించలేదు. ఆయా సంఘాలు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ రకాల ప్రయోజనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం ఆశా కార్యకర్తలు, ఒప్పంద, కాంట్రాక్టు ఉద్యోగులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఆరోగ్య కార్యకర్తలు(ఎన్‌హెచ్‌ఎం), రెండో ఏఎన్‌ఎంలు, వీఆర్‌ఏలు,పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ వీఓఏలు, వికలాంగులు, మధ్యాహ్న భోజన కార్మికులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులు, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్లతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సైతం నిరసన తెలిపాయి. వీరితో పాటు ప్రజా, విద్యార్థి, గిరిజన సంఘాలతో పాటు వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై గళమెత్తడం సాధారణంగా మారింది. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు, కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించగా.. మరికొన్ని విభాగాల వారికి వేతనాలు పెంచడం వంటి ప్రయోజనాలు దక్కాయి. వీటి మాదిరిగానే తాము కూడా సఫలం కావాలనే ఉద్దేశంతో సమస్య పరిష్కారానికి నోచుకోని వివిధ సంఘాలు గళమెత్తడం గమనార్హం.

రేపటి నుంచి సమ్మెలోకి ఆ సంఘాలు..!

ఏండ్లుగా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నా పరిష్కారం కావడం లేదనే ఉద్దేశంతో అంగన్‌వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాటపడుతున్నాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులు ఇప్పటికే నిరసన దీక్షలు కొనసాగించగా.. సోమవారం నుంచి పూర్తిగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె బాట పట్టాలని యోచిస్తున్నాయి. టైం స్కేల్ ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తుండగా..ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ సమస్యపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలకు చెందిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సైతం ఈ నెల 11వ తేదీ నుంచి సమ్మెబాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో అటు విద్యాశాఖతో పాటు పిల్లలు, గర్భిణీల సంరక్షణకు అవరోధాలు ఏర్పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిష్కారం కోసమే సమ్మెలోకి : సునీత, సీఐటీయూ అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



సమస్యల పరిష్కారం కోసం గత పదేండ్లుగా పోరాడుతున్నాం. కనీస వేతనాలు అమలు చేయలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఏండ్లుగా పోరాటం సాగిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. 2017లో కేవలం రూ.3వేలు పెంచి చేతులు దులుపుకొంది. ఇప్పటికే పలుమార్లు సమ్మెలు, ధర్నాలు చేపట్టాం.కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వినతిపత్రాలు అందించాం. ఇటీవల మంత్రితో సమావేశంలో 20 డిమాండ్లు పెడితే 15 పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ నెరవేరడం లేదు. తాజాగా మరోసారి నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమయ్యాం.

అనేక ఏండ్లుగా పోరాడుతున్నాం : పడాల రవీందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి



మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ గత దశాబ్దకాలంగా పోరాటం నిర్వహిస్తున్నాం. ఇది వరకు కేంద్రం అందజేసే వేతనాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం కోత విధించి అందజేసింది. 50శాతం పీఆర్సీ ఇవ్వాల్సి ఉండగా కేవలం 30శాతం మాత్రమే అందజేస్తోంది. ఆయా సమస్యల సాధన కోసం ఏండ్లుగా పోరాడుతున్నా పరిష్కారం కావడం లేదు. అందుకే సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించాం. 20ఏండ్లుగా పనిచేస్తున్న తమ సమస్యపై ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చేయాలి.

అందుబాటులోకి ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు

- ఆరోగ్యశ్రీతో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఈకేవైసీ చేసుకుంటేనే పథకం వర్తింపు
- 30 వరకు గడువు
- జిల్లాలో ఇంకా 20 శాతం పూర్తికాని ఈకేవైసీ

నవతెలంగాణ - బెజ్జూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో ఆరోగ్యశ్రీ పథకానికి రూ.2లక్షల నుండి రూ.5లక్షల వరకు ప్రభుత్వం పెంచింది. దీనిద్వారా రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యాన్ని అందించనుంది. అయితే తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేసుకుంటే వారికి ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 80 శాతం వరకు ఆరోగ్యశ్రీ ఈకేవైసీ పూర్తికాగా ఇంకా 20 శాతం మంది కేవైసీ చేసుకోకుండా దూరంగా ఉన్నారు. వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 30 వరకు తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేసుకోవడానికి గడువు విధించింది. ఇందుకుగాను సీఎస్‌సీ కేంద్రాల్లో ఈకేవైసీ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాగానే అందుబాటులోకి ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను పంపిణీ చేస్తామని సీఎస్‌సీ మేనేజర్ రోహిత్ తెలిపారు.



కవరేజీ అయ్యే వ్యాధులు

ఈ పథకం కింద 1672 వ్యాధులు కవరేజీ అయ్యే విధంగా రూపొందించారు. ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, కిడ్నీ, న్యూరోసర్జరీ, పుట్టుకతో వచ్చే వైకల్యం, కాలిన గాయాలు మొదలగు వ్యాధులకు ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందించనున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఎక్కడ దరఖాస్తు చేయాలి

ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఎక్కువ మొత్తం అందించాలని నిర్ణయించింది. దీని కోసం ఈకేవైసీ ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని సీఎస్‌సీ కేంద్రాల్లో ఈకేవైసీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈకేవైసీ పూర్తయిన వారికి డిజిటల్ కార్డులను అందించనున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : సీఎస్‌సీ జిల్లా మేనేజర్ రోహిత్



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ రోహిత్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులకు రూ.2లక్షల నుండి రూ.5లక్షల వరకు పెంచిందని, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. సీఎస్‌సీ కేంద్రాల్లో ఈకేవైసీ చేస్తారని తెలిపారు.

అధిక వర్షాలతో పంటలకు తెగుళ్లు

తాంసి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలకు తెగుళ్ల రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేనులో నీరు నిలవడం, తేమ శాతం ఎక్కువై పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. లద్దె, గులాబీ పురుగు ఉధృతి పెరగడంతో పురుగులమందు పిచికారి చేయడానికి ముందుకొస్తున్నా వర్షాల కారణంగా వీలు కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పంటలపై చీడపీడల బెడద ఎక్కువ కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వాలని మండల రైతులు కోరుతున్నారు.



కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు పార్టీ మండల నాయకులు విలాస్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కూచాడి శ్రీహరిరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల కోసం సీఎం కేసీఆర్ స్కీములు ప్రవేశపెట్టి పార్టీ కార్యకర్తలకే అందించి తర్వాత పక్కన పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే యువతకు మేలు జరిగిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

12న డిహెచ్ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని 10 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే ఈ నెల 12న డిహెచ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్ హెచ్చరించారు. పదవరోజు సమ్మెలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను శ్రమదోపిడికి గురిచేస్తుందన్నారు. వైద్య శాఖలో కీలకపాత్ర పోషిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం వహించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 12న డిహెచ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిపెల్లి మధుకర్, నాయకులు సధాలక్ష్మి, కౌన్సిలర్ సదానందం, డీఈవోలు సాయి, షకీల్, శ్రీదేవి, మమత, రజిత, బ్లాక్ లెవల్ అకౌంటెంట్ వెంకటేష్, ఫార్మసిస్ట్ సాయికృష్ణ, సంగీత, అనూష, స్టాఫ్ నర్సులు కమల, విజయ, సాయిలత, చామంతి, సునీత, సంభోది, ధనలక్ష్మి, కాంటినెంట్ వర్కర్స్ ముస్తాక్, సంగీత, మాన్కుబాయి, లింగవ్వ పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికులు విధులకు సక్రమంగా హాజరు కావాలని గైర్హాజరైన ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో డీజీఎం పర్సనల్ అరవిందరావు సూచించారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సూచనల మేరకు అరవిందరావు ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్కే 7,ఆర్కేఎన్టి, వర్క్ షాప్ ఉద్యోగులకు శనివారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలని, హాజరు కానట్లయితే కంపెని తీసుకునే క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే రిపోర్టులను పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు 53 మంది ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, డీవైపీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, సీనియర్ పిఓలు పి.కాంతారావు, ప్రకాష్, గని సంక్షేమ అధికారులు సృజన పాల్, సంతన్, సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని చాందా-టి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు అందజేశామని మేస్త్రి యూనియన్ అధ్యక్షులు భగత్ విట్టల్ తెలిపారు. ముత్యాలవ్వ మందిరానికి కూడా సహకారం చేశామన్నారు. గ్రామంలో మేస్త్రి యూనియన్ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర సమయంలో హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తే యూనియన్ నుండి 5 నుండి పదివేల రూపాయలు విరాళంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారుట్ల భాస్కర్, సుదర్శన్, మేస్త్రి సంఘం ఉపాధ్యక్షులు దూమాల అశోక్, ఇన్‌చార్జి బోరేకర్ ఆనంద్, అసుర విట్టల్, ఇప్ప దత్తు, కొంతం వెంకటి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాగుదాటి..వైద్యమందించి..

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కన్నపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కన్నపూర్ తండ గ్రామానికి వెళ్లాలంటే వాగు దాటల్సిందే. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగును పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రతాప్ నాయక్ తమ సిబ్బందితో కలిసి శనివారం ప్రమాదకరంగా



వాగుదాటి గ్రామస్తులకు వైద్యమందించారు. రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ట బొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జలేందర్, గంగమ్మ, సూర్యకళ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఫ్లెక్సీ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైకోలాగా ప్రవర్తిసున్నారని టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని అరెస్టును ఖండిస్తూ శనివారం పంజాబ్ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకపోయిన కావాలనే ఏపీ ప్రభుత్వం బాబును అరెస్టు చేయించిందని ఆరోపించారు. వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ రఫీక్, పార్లమెంట్ కార్యదర్శి గంగసరపు ఓమన్న, తెలుగు యువత అధ్యక్షుడు గాలిపెల్లి నాగన్న, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్‌యూసీ కార్యదర్శి భాను రాజేశ్వరరావ్, పార్టీ మండల అధ్యక్షుడు సోమ గంగారెడ్డి, రాష్ట్ర సెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్, జిల్లా నాయకులు దివాకర్‌రెడ్డి, పెంటన్న, మండల నాయకులు జక్కుల సుభాష్, షేక్ అత్తర్, నరేందర్, ఆకుల రాము పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన మండలానికి చెందిన విద్యార్థులు ఓస హాసిని, పి.రాహుల్‌లను శనివారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, డీఆర్డీఓ ఏపీడీ ఓస ప్రసాద్ ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలని, మండలానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీజీ కళాశాల అధ్యక్షులు నారాయణ, ఉపసర్పంచ్ శ్రీనివాస్, రవికిరణ్, శివ, రాజేశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వేణుగోపాలకృష్ణ తన కుమార్తె సుహాసిని పుట్టిన రోజును పురస్కరించుకొని ఆస్పత్రిలోని డయాలసిస్ విభాగంలో పండ్లు పంపిణీ చేశారు. సుహాసిని ప్రస్తుతం ఎంబీబీఎస్ రెండో సంవత్సరం హైదరాబాద్‌లో చదువుతుంది. ఈ కార్యక్రమంలో సాయితేజ, ఉదయ్, ప్రవీణ్, వినోద్, వర్మ పాల్గొన్నారు.

నగర భోజన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో బేడా బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన నగర భోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హనుమాన్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో బేడా బుడగ జంగం ఆధ్వర్యంలో నగర భోజనాన్ని నిర్వహిస్తారని అన్నారు. వారి బుర్రకథలు ప్రజలను ఎంతగానో అకట్టుకుంటున్నాయని అన్నారు. అదేవిధంగా భక్తి భావన పెంపొందుతుందని అన్నారు. దీంతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మీ రాజు, చందన, బాలాజీ, ఇస్రాల్, చాంద్ పాషా, ఎల్లన్న, సాజీద్ పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెంచేలా లైబ్రరీలు

- లైబ్రరీని ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేలా లైబ్రరీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో కోరెడ్డి అశోక్ దంపతులు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేశారు. అంతకు ముందు చైర్మెన్‌ను స్థానికులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసలు అవుతున్నారని అన్నారు. అలాంటివారిలో మార్పు తెచ్చే దిశగా చదువుపై ఆసక్తి పెంచేలా కోరెడ్డి అశోక్ దంపతులు స్థానికంగా లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కుటుంబాల్లో ఆర్థిక స్థితిగతులు మెరుగు పర్చడంలో విద్య ఎంతో ప్రాధాన్యమని ప్రతి ఒక్కరూ విద్యతోనే మార్పు సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, నారాయణ, ఆశన్న సురేఖ, సంతోష్, సాజీద్, చోటు, గంగుబాయి పాల్గొన్నారు.

రేపటి నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను క్రమబద్ధీకరించాలని తొమ్మిది రోజులుగా నిరవధిక దీక్షలు చేపడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సోమవారం నుంచి సమ్మె చేపడుతున్నామని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు శనివారం 11వ రోజుకు చేరుకోగా, శిబిరంలో భజన పాటలు పాడుతూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కాగా వీరి దీక్షలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సంఘీభావం తెలిపారు. ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థను తీసేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు వారికి అండగా కాంగ్రెస్ ఉంటుందన్నారు. అదే విధంగా ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శంకర్, నగేష్ దీక్షలకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, ప్రకాష్, వెంకటి, శ్రీకాంత్, పార్థసారథి, జ్యోతి, స్వర్ణలత, సోమన్న, వెంకన్న, రమేష్ ఉన్నారు.

నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మెను సెప్టెంబర్ 11న చేడుతున్నట్టు సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి విలాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. 60 సంవత్సరాల దాటిన అంగన్‌వాడీ ఉద్యోగులు, వాలంటరీ రిటైర్మెంట్ కోరితే బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలన్నారు. సమ్మె నోటీసులో తెలియజేసిన ఇతర డిమాండ్స్ అన్నింటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, అంగన్‌వాడీ యూనియన్ అనుబంధం జిల్లా అధ్యక్షులు రాజమణి, లలిత, జిల్లా కార్యదర్శి, శైలేజా, విజయ ఉపాధ్యక్షులు, దేవిక, సరోజ, చిన్నగంగవ్వ, అరుణ, అనురాధ, పద్మ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి

- ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భూక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రతి పక్షాలను తిప్పి కొట్టాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి, నాకు బలమని అన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి ఖానాపూర్ గడ్డపైన బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని సూచించారు. కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. అంతకుముందు మండలంలోని సాలెవాడ గ్రామంలోని శివాలయాన్ని సందర్శించి, ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, పార్టీ నాయకులు జగ్జివన్ ఉన్నారు.

మోకాళ్లపై కూర్చొని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. తమను క్రమబద్ధీకరించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ తీరుకు నిరసనగా మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ ప్రభుత్వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాడర్ ప్రకారం వైద్యారోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగులకు బెసిక్ అలవెన్స్ నిర్ణయించాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 17 వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జీఓ అమలు కానీ కెడర్లకు కూడా బెసిక్ డీఏ, హెచ్‌ఆర్ఏ తదితర వాటిని కలిపి గ్రాస్ సాలరీ నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

నవతెలంగాణ-బోథ్

తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ విగ్రహాన్ని బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేయనున్నారు. దీనికి సర్పంచ్ సురేందర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వ్యక్తి అని గుర్తుచేశారు. పద్మశాలీలకు ఏనలేని సేవలు చేశారని అన్నారు. ఆయనకు పదవులు ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, మండల అధ్యక్షుడు సదాశివ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మాసం అనిల్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం చంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్లకొండ సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు జక్కులవార్ వెంకటేష్, దయాకర్, స్వామి, సంతోష్, మల్లేష్, రాజన్న పాల్గొన్నారు.



విగ్రహానికి లక్ష రూపాయల విరాళం..

మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి రూ. లక్ష విరాళంగా అందించేందుకు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో పద్మశాలి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విగ్రహ ఏర్పాటు అంశాన్ని ప్రస్తవించగా తన వంతుగా రూ.లక్ష అందించేందుకు హామీ ఇచ్చారు.

ప్రకాష్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందీ భాషాభివృద్ధి కోసం, వందలాది హిందీ పండితులను ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో తయారు చేయడానికి విద్యా మార్తాండ్ అవార్డు గ్రహీత స్వర్గీయ ఏ.ప్రకాష్‌గౌడ్ అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 16న శనివారం జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని శాంతినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో హిందీ భాష సేవా సమితి అధ్యక్షులు సుకుమార్ పెట్కులే హిందీ పండితుల బృందం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కేవలం హిందీ పండితులకే కాదు నాకు కూడా వ్యక్తిగతంగా ప్రకాష్‌గౌడ్ చాలా సన్నిహితుడని కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ తానే స్వయంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని అన్నారు. ప్రకాష్ గౌడ్ సేవల్ని స్మరిస్తూ హిందీ పండితులంతా కలిసి 16న కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందదాయక విషయమని, దేశ భాష హిందీ ఔన్నత్యాన్ని జిల్లాలో చాటి చెప్పిన గొప్ప వ్యక్తి ప్రకాష్‌గౌడ్ అని కొనియాడారు. కార్యక్రమంలో హిందీ భాషా సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి జాబాడే, ప్రచార కార్యదర్శి సాంబన్న శేండే, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.భాస్కర్ పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం

- ఉట్నూర్ మున్సిఫ్ సివిల్ కోర్టు జడ్జీ దుర్గారాణి



నవతెలంగాణ-ఉట్నూర్

రాజీతోనే కేసుల పరిష్కారం అవుతాయని ఉట్నూర్ మున్సిఫ్ సివిల్ కోర్టు జడ్జీ, మండల న్యాయ సేవా సంస్థ చైర్మెన్ దుర్గారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ దుర్గారాణి మాట్లాడుతూ సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కేసుల పరిష్కారానికి ఇరువర్గాల కక్షిదారులు రాజీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 624 కేసులను పరిష్కరించినట్టు తెలిపారు.

బోథ్ : జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని ఆయా గ్రామాల నుంచి కక్షిదారులు రాజీమార్గం ద్వారా వెయ్యి కేసులు పరిష్కరించారు. అలాగే రూ.22 లక్షల 98 వేల రికవరీ అయిందని జడ్జి బి.హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, న్యాయవాదులు పంద్రం శంకర్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, అడెపు హరీష్, కుమ్మరి విజయ్, విక్రమ్ సింగ్, జమీర్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బేల

కాళోజీ నారాయణ రావ్ జయంతిని పురస్కరించుకోని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణచివేతకు గురైన భాషా, యాస గొప్పదనం, కాళోజీ సేవలు, ఆయన ఆశయాల గురించి, వక్తలు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వరప్రసాద్ రావ్, అధ్యాపకులు ప్రవీణ్, కిషన్‌రెడ్డి, సాగర్, అమూల్, సంజీవ్, బిందు, విజయ, సౌందర్య పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కేజీబీవీ పాఠశాలలో తీజ్ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో నిర్వహించే ఈ పండుగ విశిష్టతను తెలియజేసేలా విద్యార్థులు వేడుకను నిర్వహించారు. బుట్టిలో గోదుమ విత్తనం చల్లి మొక్కలు పెరిగిన వాటికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ లలిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

నవతెలంగాణ-బేల



నిరుపేద కుటుంబానికి జైహనుమాన్ ఫర్టిలైజర్ యాజమాని ఇట్బాడి సుశాంత్‌రెడ్డి నిత్యావసర సరకులను అందించి ఉదారతను చాటారు. శనివారం మండలంలోని అవాల్‌పూర్ గ్రామానికి చెందిన కుర్సెంగ గీత, ప్రవీణ్‌లకు ఇటీవల ఆడబిడ్డ పుట్టింది. పౌష్టికాహారం లోపం బిడ్డకు రావడంతో తన వంతుగా రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో ఇట్టడి రాజారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో పెరుగుతున్న పోటీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పోటీ పెరిగింది. ఇప్పటికే పలువురు నాయకులు దరఖాస్తులు చేసుకున్నారు. తాజాగా శనివారం మాజీ రైల్వే బోర్డు సభ్యుడు కేసీ భార్గవ్ హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కోసం దరఖాస్తును అందించారు.

57వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-బోథ్

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 57వ రోజుకు చేరుకున్నాయి. రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేంతవరకు దీక్షలను కొనసాగిస్తామని సాధన కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకు అందజేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని దిందా గ్రామంలోగల నిరుపేత కుటుంబానికి శనివారం మానవ సేవే మాదవసేవ సమితి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు. ఆర్తిక ఇబ్బందులతో బాదపడుతున్న లంగారి లచ్చయ్య గంగక్క దంపతులకు బియ్యం, బట్టలు, కూరగాయలు, నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి వెంకన్న, ఎంపీటీసీ చప్లే రోజా సుధాకర్, ఉపసర్పంచ్ జునుగారి భాగ్య శేఖర్, బోర్కుట్ వెంకన్న, బోగా రాజమౌళీ, మనవ సేవే మాధవ సేవ అధ్యక్షుడు లోడెల్లి ప్రవీణ్, దిందా సర్పంచ్ దుర్వ యశోద సంతోష్, సురేష్, సోమయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

పత్తి పంటకు పిచికారీ చేస్తూ రైతు మృతి

నవతెలంగాణ-కెరమెరి



పత్తి పంటకు పిచికారీ చేస్తూ మందు ప్రభావంతో రైతు తీవ్ర అస్వస్థతకు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలం లోని లక్మాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణ్(52) అనే రైతు తన పత్తి పంటకు క్రిమి సంహారక మందును పిచికారీ చేసేందుకు వేళ్లాడు. రసాయనాల ప్రభావంతో స్పృహకొల్పోయాడు. గ్రామస్తులు గమనించి వెంటనే వాగు దాటించి, మండల కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు.

న్యాయం చేయాలని వృద్ధురాలి వేడుకోలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తనకు చెందాల్సిన సొంత పట్టాభూమిని తన పెద్ద కుమారుడు తీసుకుని తనను పోషించడంలేదని తనను ఆదుకోవాలని ఓ వృద్ధురాలు వేడుకుంటోంది. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. మండలంలోని సీతానరగ్(గంగన్న గూడ) గ్రామనికి చెందిన దంపతులు మౌల్కర్ మల్లయ్య పోచుబాయిలకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు తులసీరాం, విశ్వనాథ్, గణపతిలు ఉన్నారు. 1999లో భర్త మల్లయ్య చనిపోవడంతో పెద్ద కుమారుని వద్ద ఉంటూ పోచుబాయి జీవనాన్ని కొనసాగిస్తుంది. తండ్రి మల్లయ్య పేరున ఉన్న 40 ఎకరాల భూమిలో ఐదు ఎకరాలు తల్లి పోషణకు కేటాయించి మిగతాది పంపకం చేసుకున్నారు. తల్లికి కేటాయించిన భూమిని పెద్ద కుమారుడు తన ఆధీనంలోనే ఉంచుకుని కొంతవరకు పోషణ చేశాడు. ఈ భూమిని తన పేరున పట్టా చేయించాలని పెద్ద కుమారుడు నానావిధాలుగా తల్లిని ఇబ్బందులకు గురిచేస్తున్నందున ప్రస్తుతం కాగజ్‌నగర్ లో ఉంటున్న చిన్న కుమార్తె ప్రమీల వద్ద ఉంటుంది. ఈవిషయంలో నాకు న్యాయం చేయాలని రెండవ కుమారుడు విశ్వనాథ్ సహకరిస్తున్నందున పెద్ద కుమారుడి కుటుంబీకులతో పాటు చిన్నకుమారుడు గణపతిలు దాడులకు పాల్పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోనందున న్యాయం చేయాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

బాబు అరెస్టుకు నిరసనగా జగన్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును జగన్ ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శ్రేణులు జిల్లా కేంద్రంలో నిరసనలు తెలిపాయి. శనివారం అంబేద్కర్ చౌక్‌లో ఏపీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు గుళ్ళపల్లి ఆనంద్ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందన్నారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో పెద్ద ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుగు ఆత్మరాం, మల్లికార్జున్, టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల్కర్ సాయిరాం, రాష్ట్ర కార్యదర్శి మహేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పృథ్వీ, శేఖర్, రవి, గులాబ్, లక్ష్మణ్, సంజీవ్ పాల్గొన్నారు.

13వ రోజు కొనసాగిన ఎస్ఎస్ ఉద్యోగుల రిలే దీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 13వ రోజుకు చేరుకున్నాయి. సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వంటవర్పుతో పాటు కాళోజి జయంతిని పురస్కరించుకొని బొమ్మను వేసి వినతి పత్రం అందించారు. వీరికి కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ నాయక్ మద్దతు తెలిపి వంటవర్పులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని 13 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు సందీప్, శ్రీనివాస్, మహేష్, రాజేష్, రమణ, తిరుమల, మమత పాల్గొన్నారు

18న వినాయక చవితి, 28న నిమజ్జనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ఈ నెల 18న వినాయక చవితి నిర్వహించుకోవాలని వేదపండితులు ముద్దు రాజేంద్రప్రసాద్‌శర్మ సాయిరాం, ఓంకార్ శర్మ రాజేందర్ శర్మ, షణ్ముఖాచారి తెలిపారు. శనివారం కాగజ్‌నగర్‌లోని త్రినేత్ర శివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 18న ఉదయం పది గంటలకు చవితి వస్తున్నందున ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు వినాయక విగ్రహ ప్రతిష్టాపన చేసుకోవచ్చని, సాయంత్రం 4-30 నుంచి 06-20 వరకు ప్రతిష్టాపన చేయకుండా, ఆ తర్వాత రాత్రి వరకు కూడా ప్రతిష్టాపన చేసుకోవచ్చని సూచించారు. మంగళవారం ఎట్టి పరిస్థితులలో కూడా విగ్రహ ప్రతిష్టాపన చేయరాదని సూచించారు. భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు శివగౌడ్ మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లో ఈ నెల 28న వినాయక నిమజ్జనం కార్యక్రమానికి ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతీ ఏటా హైదరాబాద్‌లో ఏరోజైతే గణేష్ నిమజ్జనం చేస్తారో అదే రోజు కాగజ్‌నగర్‌లో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తున్నందున 28న నిమజ్జనం ఉంటుందని, పట్టణంలోని అన్ని గణేష్ మండపాల వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

తెలంగాణ ప్రజల ఉద్యమ ప్రతిధ్వని కాళోజి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ప్రజలకు సంబంధించిన ప్రతి ఉద్యమానికి కాళోజీ ప్రతిధ్వనిగా నిలిచారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. కాళోసీ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఎంపీపీ మల్లికార్జున్‌లతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఉద్యమం ఊపిరిగా కాళోజీ పనిచేశారని తెలిపారు. తాను రచించిన పుస్తకాలు కవితల ద్వారా తెలంగాణ ఆకాంక్షను తెలియజేశారని అన్నారు. ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొంటూ తెలంగాణ సమాజాన్ని రాజకీయంగా, సామాజికంగా చైతన్యపరచడంలో ఆయనకంటూ ప్రత్యేకంగా ఒక శైలి ఉందని కొనియాడారు. పుట్టుక చావు కాకుండా తన జీవితాన్నంతా తెలంగాణ కోసం ధారాదత్తం చేసిన గొప్ప మహనీయుడు అని కొనియాడారు. నిజాం దమననీతికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తన కలం ద్వారా నిరసన తెలిపిన మహానుభావుడు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు తెలంగాణ ఉద్యమకారుడు అయిన కాళోజీకి 1992లో దేశ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్ అవార్డు దక్కిందన్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా దినోత్సవంగా జరుపుకోవడం తెలంగాణ సమాజానికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచులు శ్రీనివాస్ నాయకులు నిసార్, అహమ్మద్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాండూరు : సీఓఈలో కాలోజీ జయంతి

తాండూరు : తెలంగాణ యాసను భాషగా గుర్తించేలా తనజీవితాంతం కృషిచేసిన కాళోజీ నారాయణరావు తెలంగాణ తొలిపొద్దు అని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. శనివారం కాళోజీ జయంతి సందర్భంగా సీఓఈలో తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలకుల తప్పులను ఎత్తిచూపుతూ ప్రజలక్షేమం కోసం జీవితాంతం కృషిచేసిన తెలగాణ తొలిపొద్దు కాళోజీ అన్నారు. ప్రజల బాధలను అర్ధంచేసుకొని అన్యాలను ఎదురిస్తూ పోరాడిన ఆయన సేవలను తెలంగాణ సమాజం గుర్తించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయనను కార్యదీక్షతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు.

అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు పరిష్కరించాలి

- అంగన్‌వాడీ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

అంగన్‌వాడీ ఉద్యోగులందరిని వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ ఉద్యోగులు ఈ నెల 11న తలపెట్టిన నిరవధిక సమ్మె గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 18న ఐటీడీఏ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ జేఏసీ సంఘాలతో జరిపిన చర్చల్లో అంగీకరించిన డిమాండ్లకు కట్టుబడి ఉండకుండా మంత్రి ఇచ్చిన హామీలకు భిన్నంగా పత్రికా ప్రకటన ఇచ్చి అంగన్‌వాడీ ఉద్యోగులను మానసిక ఆందోళనకు గురిచేసిందన్నారు. 40 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా అతి తక్కువ వేతనాలు ఇచ్చి అధిక పని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తప్పనిసరి పరిస్థితిల్లో ఈ నెల 11న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చామని తెలియజేశారు. జేఏసీ సంఘాలతో చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ కుమురం భీం జిల్లా ఉపాధ్యక్షుడు ఏ ఓదెలు అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, సీఐటీయూ మండల నాయకులు సిద్దెంకి సత్తయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు తిరుపతమ్మ, బాలమ్మ, శ్యామల, మల్లీశ్వరి, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్, బీఎస్ఎఫ్‌లో ఎంపికైన యువకులకు సన్మానం



నవతెలంగాణ-కౌటాల

ఎంబీబీఎస్‌లో సీటు సాధించి బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికైన ఇద్దరు ఆరెకుల యువకులను ఆరెకుల ఉద్యోగుల సంఘం కుమురం భీం జిల్లా పక్షాన వారిన శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవధ్యక్షుడు నరులె రాందాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామమైన తుమ్మిహేట్టికి చెందిన నగపురె తిరుపతి అరుణ దంపతుల కుమారుడు కార్తీక్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా, గుడ్లబోరి గ్రామానికి చెందిన ఉపాసె బాబాజీ కుమారుడు అశోక్ బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికైనందుకు వారిద్దరిని సన్మానించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన కార్తీక్‌ను చదువు కోసం ఆర్థిక సాయం అందించడానికి కూడా ముందుంటామని అన్నారు. ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న తర్వాత ఎంఎస్‌సీ చేయడానికి ఇప్పటి నుండే కష్టపడి చదవాలని వారికి సూచించారు. అదేవిధంగా చదువుకొని ఎంత ఎత్తుకు ఎదిగిన కన్న తల్లిదండ్రులను, ఉన్న ఊరిని మరిచిపోవద్దని కోరారు. ఆరెకుల సమాజ అభివృద్ధికి తోడ్పాటునందించడానికి ఉద్యోగుల సంఘం తరపున ఎప్పుడైనా ముందుంటామని వారికి సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డోకె దామోధర్, ప్రచార కార్యదర్శి ఎలుకరి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి చౌదరి అంజన్న, ఎల్మలె జ్ఞానేశ్వర్, వసంత్‌రావు, శ్యాంరావు, బండు, తులసీరాం, యాదవ్, విలాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఇంటింటికి డీవైఎఫ్ఐ



నవతెలంగాణ-రెబ్బెన

ఇంటింటికి డీవైఎఫ్ఐ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రాంపూర్, వంకులం, నవేగాం గ్రామాల్లో మాస్ క్యాంపియన్ నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజురోజుకు రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతూ పోతుందని, యువత ఉద్యోగాలు లేక కూలి, నాలి పనులు చేసుకుంటున్నారని అన్నారు. కుమురం భీం జిల్లా ఏర్పాటైనా నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో ప్రభుత్వం ఎలాంటి పరిశ్రమలు పెట్టలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిశ్రమలు స్థాపించి యువకులకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పటివరకు జిల్లాలో ఏ ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కుమురం భీం జిల్లాలో పరిశ్రమలు పెట్టి చదువుకున్న యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

కార్యక్రమంలో డీఐఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు సతీష్, నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, శివ, నాయకులు వంశీ, తిరుపతి, కార్తీక్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు మంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేసిన 34 రోజుల సమ్మెను విరమింపచేసే ప్రయత్నంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ ఇచ్చారన్నారు. వాటిని వెంటనే నెరవేర్చేలా ప్రయత్నం చేయాలని లేని పక్షంలోపోరాటం తప్పదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26000, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల పాలిట శాపంగా మారిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, జీవో నెంబర్ 51ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి పెరిక శ్రీకాంత్, జిల్లా నాయకులు మాట్లరాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేసుల సత్వర పరిష్కారమే లోక్‌అదాలత్ లక్ష్యమని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్‌తో కలిసి కేసుల పరిష్కారం కోసం 3 ప్రత్యేకంగా బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పరిష్కారం కాకుండా ఉన్న కేసులకు దీని ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు గత లోక్ అదాలత్ కంటే రెట్టింపు కేసులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాగా లోక్ అదాలత్‌లో 1310 కేసులను పరిష్కరించి ఫైన్‌ల రూపంలోరూ. 12, 27,030 వసూళు అయినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ జడ్జి రవి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

నెట్ బాల్‌లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సింగిల్ విండో చైర్మెన్ అలిబిన్ అహ్మద్ ఆకాక్షించారు. నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వేళ్తున్న క్రీడాకారులతో మాట్లాడి మెలుకువలు నేర్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్ బాల్‌లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, జిల్లా కార్యదర్శి బి.తిరుపతి, కోచ్‌లు హరీష్, యోగి, అర్చనకుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ శిక్షణ తరగతుల్లో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో ఆర్టీసీ కళాభవన్‌లో ఒకరోజు నిర్వహించిన కాంగ్రెస్ శిక్షణ తరగతులకు జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌తో పాటు నాయకులు హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు, ప్రజల్లో మమేకం తదితర వాటిపై శిక్షణ తరగతుల్లో వివరించినట్లు నాయకులు తెలిపారు. ఈ శిబిరంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు చరణ్, నాయకులు వసంత రావు, కాంగ్రెస్ మండల, బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ మంజూరు చేసేంతవరకు దీక్ష

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో 132 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించేంతవరకు దీక్ష విరమించేదిలేదని సామాజిక కార్యకర్త భూమాచారి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ భూమాచారి చేపట్టిన దీక్ష శనివారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వ్యాపార, తదితర సంఘాల నాయకులు ఆయనకు మద్దతు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్ స్టేషన్ ఏర్పాటుపై ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు బన్సీలాల్ రాథోడ్ అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న భూమాచారికి బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు.

ఘనంగా ప్రజా కవి కాళోజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-భీమారం



ప్రజా కవి కాళోజీ నారాయణరావు 109వ జయంతి వేడుకలను శనివారం మండలంలో పలు ప్రజా సంఘాల నాయకులు, యువత ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యలయంలో నిర్వహించిన వేడుకల్లో తహసీల్దార్ విశ్వంబర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అరుణ, సీనియర్ అస్టెంట్ రాజ్, మహ్మద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు శాఖలో కలకలం



నవతెలంగాణ-హాజీపూర్

పోలీసుల శాఖలలో కొంత మంది ఎస్సైలు తమదైన శైలిలో పొగడతల కోసం పరిధులు దాటుతూ అసాంఘిక కార్యకలపాలపై దాడులు నిర్వహిస్తు పోలీసు శాఖలో కలకలం రేపుతున్నారు. ఇతర మండలం నుంచి వచ్చి పోలీసులు పేకాట స్థవరాలపై దాడి నిర్వహించి పెద్ద మొత్తంలో నగదు పట్టుకుంటే స్థానిక పోలీసులకు సమాచారం కూడా రావడం లేదా... వారి నిఘా వ్యవస్థ పటిష్టంగా లేదనే అనుమానలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇతర మండల పరిధిలోని పోలీసులు తమ పరిధిలో వచ్చి దాడులు నిర్వహించడంతో ఆ ప్రాంత ఎస్సైలు ఉన్నతాధికారులు ఫిర్యాదులు చేస్తుండడంతో కొత్త తలనొప్పిగా మారింది. ఎన్నికల సందర్భంగా హాజీపూర్ ఎస్సైగా నరేష్ మూడు నెలల క్రితం బాధ్యతలు తీసుకున్నారు. అనాటి నుంచే తన పరిధిని వదిలి ఇతర పరిధిలో జరగుతున్న అసాంఘిక కార్యకలపాల్లో చేతులు పెట్టడం మొదలు పెట్టారు. మూడు నెలల క్రితమే మంచిర్యాలలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి పలువురిని పట్టుకున్నారు. అయితే ఆ సమయంలో పేకాట రాయుళ్ల నుంచి పెద్ద మొత్తంలో నగదును స్వాదీనం చేసుకోని తక్కువగా చూపించారనే ఆరోపణలుకూడా వచ్చాయి. తాజగా శనివారం మంచిర్యాలలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి రూ. ఆరు లక్షల నగదును స్వాదీన పరుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులు పూర్తి సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఇదిలా ఉంటే తన పోలీసు స్టేషన్ ముందు నుంచే పీడీఎస్ బియ్యం యథేచ్ఛగా రవాణ అవుతున్న పట్టించుకోని స్థానిక ఎస్సై పరిధి కాని మంచిర్యాలలో దాడులు నిర్వహించడంపై ఆ శాఖ అధికారులు సైతం గుర్రుగాఉన్నట్లు సమాచారం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ హెల్త్ అసిస్టెంట్ కమలాకర్ అన్నారు. శనివారం ఉదయం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా రక్త మూత్ర పరీక్షలు చేసి మందులు అందించారు. కలరా, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవి, అపరంజి, ఆశ రజిత, అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, గంజాయిల జమున, ఎమ్మెల్యే హెచ్‌పీ సందీప్, వార్డు సభ్యులు రాజన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

పేదలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-చెన్నూర్

చెన్నూర్‌లో పేదలపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కార్యదర్శివర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అథితిలుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు పైల్ల ఆశయ్యలు హాజరయ్యారు. ముందుగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ఇళ్ల స్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాటలను నిర్వీర్యం చేసేందుకు చెన్నూర్ పట్టణంలో భూకబ్జాదారులు, కిరాయి రౌడిలు దాడి చేసి పెట్రోల్ పోసి గుడిసెలను కాల్చివేయడంతో మహిళాలపై దాడి కులం పేరుతో దూషించాన్ని ఖండించారు. దాడి విషయమం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సంకే రవి, కనికరపు అశోక్, జి.ప్రకాష్, అశోక్, దాసరి రాజేశ్వరీ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్‌కు హరినాయక్ దరఖాస్తు

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాయక్ దరఖాస్తు సమర్పించారు. శనివారం ఆయన హైదరాబాదులోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులకు దరఖాస్తు అందించారు. ముందుగా హైదరాబాద్‌లోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో తాను చాలా పోరాటాలు చేస్తున్నానని, తనకు అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పేర్కొంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోలిచంద్, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు కోడిమెల లక్ష్మణ్, కడెం మండల అధ్యక్షుడు ధర్మాజీ కిష్టయ్య, ఖానాపూర్ మండల అధ్యక్షుడు టేకు ప్రకాష్, బీజేవైఎం నాయకులు ముడుగు ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అంగన్‌వాడీల సమ్మె

- సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-హాజీపూర్

రేపటి నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులు చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కోరారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ముఖ్య నాయకుల సమావేశం బెల్లంపల్లి కార్యాలయంలో భానుమతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ మధ్యకాలంలో మంత్రి, కమిషనర్‌తో చర్చలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా చివరికి సమ్మె బాట పట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు సమ్మెకు వెళ్లొద్దని బెదిరింపులకు, భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ బెదిరింపులకు, భయభ్రాంతులకు భయపడేది లేదని తెలిపారు. సమ్మె అనేది మ హక్కు కాబట్టి జిల్లాల్లో ఉన్నటువంటి అంగన్‌వాడీ ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఐసీడీఎస్ అధికారుల బెదిరింపుల ఆపాలన్నారు. మా డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల కోరారు. ఈ కార్యక్రమంలో దాగం రాజారం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు అనురాధ, సత్యవతి, శంకరమ్మ, సంగీత, భాగ్య,రాజేశ్వరి, ప్రసన్న, అనసూయ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు గుర్తించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల బాధలను అధికారులు గుర్తించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌కేసీ హెచ్‌పీలో వేతనాల పెంపుదలకు పోరుబాటలో భాగంగా నిర్వహించిన చేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా 7వ తేదిన వేతనాలు ఇప్పించాలని కొత్తగూడెం హెడ్‌ఫీస్ నుంచి డైరెక్టర్లు సర్క్యులర్ పంపినా కింది స్థాయిలో కార్మికులకు మాత్రం అమలు కావడం లేదని అన్నారు. డైరెక్టర్లు విడుదల చేసిన సర్క్యులర్‌లకు విలువ లేదా అని ప్రశ్నించారు. లేకుంటే అధికారులే అమలు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వచ్చేవే అరకొర వేతనాలు, ఆ వేతనాలు సైతం నెల చివరి వారంలో తప్ప ముందు ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సమయానికి వేతనాలు రాక పాల వారి నుంచి ఇంటి కిరాయి వరకు అందరి నుంచి తీవ్ర ఒత్తిడితో మానసికంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు కార్మికుల వేతనాలు మాత్రం అంతంత మాత్రంగా ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు 7వ తేదిన వేతనాలు అమలు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే కార్మికులందరిని ఐక్యం చేసి మరో పోరాటానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు పెద్ద లచ్చన్న, వెంకటేష్, లక్ష్మయ్య, నర్సయ్య మల్లేష్, బానయ్య శ్రీనివాస్, హరిష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌కు టీడీపీ నాయకుల నిరసన



నవతెలంగాణ-మందమర్రి

ఆద్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడపై స్థానిక టీడీపీ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మందమర్రి మార్కెట్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏపీ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో 45 సంవత్సరాల సుధీర్ఘ అనుభవం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి 2సార్లు ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్‌కి ఒకసారి ముఖ్యమంత్రిగా పారదర్శక పాలనను అందించిన జాతీయ స్థాయి నాయకునికి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే విడుదల చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దొంగాటాడుతూ చంద్రబాబును ఇరకాటంలో పెట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో ఇద్దరినీ ఇంటికి పంపడం ఖాయంమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర నాయకుడు వాసాల సంపత్, పట్టణ మహిళా ఇన్‌ఛార్జి జయ, పార్టీ పట్టణ ఇన్‌ఛార్జి ముల్కల లక్ష్మీరాజం, పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మండల ఇన్‌ఛార్జి మందాటి రాజిరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షురాలు జూపాక సంధ్య, కవిత, కమల, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మమత, పట్టణ ఉపాధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు వొడ్నాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు బకాయిలు చెల్లించాలని నిరాహార దీక్ష



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి 11వ వేజ్ బోర్డు బకాయిలు చెల్లించాలని మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. నిరాహార దీక్షకు ముఖ్య అతిథులుగా హాజరైన సెంట్రల్ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ ఇన్‌ఛార్జి చిప్ప నర్సయ్యలు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 వ వేజ్ బోర్డు 23 నెలల బకాయిలను, 2022-2023 సంబందించియిర లాభాలలో 35 శాతం వాటాను కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సొంతింటి పథకం అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్ యాజమాన్యమే భరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 14/08/23 తేదిన సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి యాజమాన్యానికి మెమోరాండం ఇచ్చినప్పటికీ కనువిప్పు కలుగలేదని విమర్శించారు. అందుకే ఈ రిలే నిరాహార దీక్ష చేపట్టామని తెలిపారు. కోల్ ఇండియాలో 11వ వేజ్ బోర్డు ఏరియల్స్ కార్మికులకు ఒకేసారి చెల్లించారని కానీ సింగరేణిలో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలియడం లేదని వెంటనే లాభాల డబ్బులపై ఆర్థిక స్థితి గతులపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసారు. తమ డిమాండ్లకు పరిష్కారం చూపకపోతే ఆందోళనను తీవ్రం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరి దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచ్ ఆంజనేయులు, వెంకటస్వామి, శ్రీనివాస్, తిరుపతి, సంపత్, మల్లయ్య, బాలయ్య, శర్మ పాల్గొన్నారు.

అభ్యర్థి గెలుపుకు ఎంపీపీ దంపతుల పూజలు

నవతెలంగాణ-జన్నారం

రానున్న ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ భారీ మెజారిటీతో గెలవాలని కోరుకుంటూ ఎంపీపీ మాదాడి సరోజ రవీందర్రావు దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పోన్కల్ గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడాలని కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. అందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు

నవతెలంగాణ-దండేపల్లి

బీజేపీ తరఫున మంచిర్యాల అభ్యర్థికి జిల్లా మాజీ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి కొతం నవీన్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తన దరఖాస్తును అందించి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టం కోసం అహర్నిశలు కృషి చేసి, పార్టీ విధానాలకు అనుగుణంగా వ్యవహరించానని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ జనాభా ఎక్కువ ఉన్నందున బీసీ నాయకులకే సీటు కేటాయించాలని విన్నవించారు.

నేటి బీసీ రాజ్యాధికార సమాలోచన సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాలు బీసీలకు కేటాయించాలని డిమాండ్‌తో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించే బీసీ రాజ్యాధికార సమాలోచన సభను విజయవంతం చేయాలని బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ కోరారు. శనివారం మంచిర్యాలలో బీసీ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ బీసీ రాజ్యాధికారం, బీసీల రాజ్యాంగ హక్కులని నిలబెట్టుకోవడానికి చేపట్టాల్సిన కార్యక్రమంపై చర్చించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కీలక స్థానాల్లో బీసీలను గెలిపించుకునే దిశలో బీసీలలో చైతన్యం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సీసీసీ షిర్కె కాలనీ ప్రెస్ క్లబ్‌లో ఉదయం పది గంటలకు జరగనున్న రాజ్యాధికార సమాలోచన సదస్సులో అన్ని కులాలు సంఘాల నాయకులు బీసీ బహుజన సంఘాల ముఖ్యబాధ్యులు కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేశం, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజన్న, బీసీ నాయకులు నీరటి రాజన్న, మొగిళి తిరుపతి, సోమయ్య, భూమన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుకు అహర్నిషలు కృషి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే ఆశావాహుడు టీపీసీసీ డాక్టర్స్ సెల్ వైస్ చైర్మన్ డా.దాసారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలోని స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమంలో స్వామి వారి సన్నిదిలో ప్రమాణం చేశారు. ఇతర పార్టీల ప్రలోబాలకు లోనవ్వకుండా ప్రజలతో మమేకమవుతూ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం అధిష్టానం ఆదేశాల మేరకు అహర్నిశలు శక్తివంచన లేకుండా పని చేస్తానని సామజిక స్థానికతలను ప్రామాణికంగా తీసుకోని నాకు అవకాశం ఇస్తే అభివృద్ధి అనేది మంత్రం లాగా జపించకుండా యజ్ఞం లాగా చేసి చూపిస్తానని పేర్కొన్నారు.

రాజీ మార్గమే.. రాజ మార్గం



నవతెలంగాణ-చెన్నూర్

పట్టణంలో స్థానిక సివిల్ కోర్ట్ ప్రాంగణంలో సుప్రీం కోర్ట్, హైకోర్టు ఆదేశాల మేరకు సివిల్ జడ్జి సంపత్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కోర్ట్ పరిధిలోని సుమారు 543 కేసులు రాజీ మార్గంలో పరిష్కారం అయినట్లు సివిల్ జడ్జ్ సంపత్ పేర్కొన్నారు. ఇరు పక్షాలు ఏకమై సమ్మతించడంతో కేసులు పరిష్కరమయ్యాయని ఆయన తెలిపారు. ఇందులో భూ సమస్యలు, మద్యం తాగి వాహనాలు నడిపినవారు, సివిల్ కేసులు భార్యా భర్తలు కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవునిగూడలో బయోగ్యాస్ ప్లాంట్ సందర్శన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడా గ్రామపంచాయతీ, కొత్తూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్‌ను స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర కోఆర్డీనెటర్ వెంకటేష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయో వ్యర్థాల ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా వంట గ్యాస్ ఉత్పత్తి చేయడం అభినందనీయమన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో భాగంగా ఇట్టి నిర్మానాన్ని చేపట్టిన గ్రామ సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డిని అభినందించారు. ఆయన వెంట ఎస్బీఎం జిల్లా సభ్యుడు రాజేందర్ ఉన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధి హామీ ఏపీఓ రవీందర్, ఈసీ విలాస్ వర్మ పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్, పంచాయతీ సెక్రటరీ సరిత పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులుగా ఇద్దరు దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థులుగా శనివారం ఇద్దరు దరఖాస్తులు అందించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ, కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి మందాడె సుధాకర్‌లు హైదరాబాద్‌లో వేర్వేరుగా దరఖాస్తులు అందించారు. దరఖాస్తు అందించిన కొంగ సత్యనారాయణ వెంట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిప్పిడి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుల్గం నారాయణ, ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, నాయకులు సందీప్‌కుమార్, గుమ్ముల సాయికృష్ణ ఉన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు ముగింపు

జన్నారం: శ్రావణ మాసంలో బంజారా, లంబాడాలు ఎంతో వైభవంగా నిర్వహించే తీజ్ ఉతత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. మండలంలోని సేవాదాస్‌నగర్ నుంచి తహసీల్దార్ చౌరస్తా వరకు లంబాడి యువతులు మొలకెత్తిన గోధుమ బుట్టలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరారు. మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో బంజారా మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వరి నారును నెత్తిన ఎత్తుకొని మహిళలు ఊరేగింపుగా వెళ్లి సమీప వాగులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్, బీజేపీ నాయకురాలు, జానుబాయి, బీఎస్పీ నాయకులు రాథోడ్ బన్సీలాల్, కాంగ్రెస్ నాయకులు రామ్‌కిషన్ నాయక్, మాజీ ఎంపీపీ శంకరయ్య, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బంజారా లంబాడా, నాయకులు మహిళలు పాల్గొన్నారు.



మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు గుండి రోడ్డులో గల వాసవి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి శ్రీధర్ సుమన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ దశ ఎంతో గొప్పదని, సరైన జీవిత లక్ష్యం ఎంచుకునే సమయం అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యజమానులు బాలాజీ, లింగమూర్తి, పవన్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



స్పోర్ట్స్ స్కూల్ ఎదుట ఏబీవీపీ నాయకుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని స్పోర్ట్స్ స్కూల్‌ని సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఉద్యోగులలో కేవలం ఇద్దరితో మాత్రమే సరిపెడుతున్నారని, మిగతా వారు కేవలం వారి సొంత స్వలాభాల కోసం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం రిజిస్టర్లో సంతకాలు చేసి తీరా మరుసటి రోజు ప్రత్యక్షమవుతున్నారని ఆరోపించారు. ఇది గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న వ్యవహారమన్నారు. స్థానికంగా ఉన్న ఉద్యోగులలో బీఆర్ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్న కార్యకర్తలలో కొంతమంది ఈ పాఠశాలలో పని చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యారంగ సమస్యలపై హాస్టల్ సమస్యలపై తాము పర్యటన నిమిత్తం వెళ్లినప్పుడు ఆ సమయంలో ఇలాంటి అధికారులు లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థులపై లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు వారిని సస్పెండ్ చేసేంతవరకు ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అక్షయ్, అఖిలేష్, నిఖిల్, కార్తిక్ పాల్గొన్నారు.

పర్యావరణ రెమిడేషన్ ప్లాన్స్‌పై సమీక్ష

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో పర్యావరణ రెమిడేషన్ ప్లాన్స్‌పై సంబంధి కార్పొరేటర్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జెవిఎల్ గణపతి, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ శనివారం సమీక్షించారు. ఆర్జీ-1 ప్రభావిత ప్రాంతాలలో పర్యావరణ రెమిడేషన్ ప్లాన్స్‌కు సంబంధించి చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏజెంట్ బానోతు సైదులు, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, సర్వే అధికారి ప్రభాకర్, మేనేజర్ మల్లిఖార్జున్ యాదవ్, అడిషనల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

నవతెలంగాణ-గోదావరిఖని

ఉపాధ్యాయ వత్తి ఎంతో గొప్పదని ఎన్టీపీసీ రామగుండం సీజీఎం కేదార్ రంజన్ పాండు, దీప్తి లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి దాస్ అన్నారు. ఎన్టీపీసీ పిటిఎస్‌లోని సెయింట్ క్లేర్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. వారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. చిన్నారులు నత్యాలు, నాటికలతో అలరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులందరినీ ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ ఎ.డోమినిక్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఓ హెచ్ఆర్ బిజోయ్ కుమార్ సిక్టర్, ఎన్టీపీసీ అధికారులు కెవిఎంకె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బాండ్ అందజేత

నవతెలంగాణ-గోదావరిఖని

అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన అలువోజు లింగమూర్తి అనారోగ్య కారణాల రీత్యా అకాల మరణించడంతో అతని పిల్లలు అలోవుజు శాలిని, నంది ఇద్దరు చిన్నారుల పేరు మీద గ్రామస్తుల ఆర్థిక సహాయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రామగుండం నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గాదే సుధాకర్ 50వేల రూపాయలను సుకన్య సంయోజన పథకం కింద ఫిక్స్‌డ్ చేసి డిపాజిట్ పత్రాన్ని శనివారం అందజేశారు. సహాయం అందించిన గ్రామస్తులకు ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-గోదావరిఖని

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూపి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు అకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నరని రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దోంతుల కిరణ్ ఎమ్మెల్యే సమక్షంలోపార్టీ లో చేరారు. కార్యక్రమాల్లో అంతర్గాం మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్, కార్పొరేటర్ జనగామ కవిత సరోజిని, సర్పంచ్ ధర్మాజీ కృష్ణ, జెవి రాజు, బోడ్డుపల్లి శ్రీనివాస్, తోకల రమేష్, మేకల అబ్బాస్, ఇరుగురాల్ల శ్రావణ్, వడ్డెపల్లి క్రాంతి ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-ముత్తారం

విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ చేగొండ రాజకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, మద్దతు తెలిపారు.

మంత్రి కమలాకర్‌కు జడ్పీ చైర్మన్ వినతి

నవతెలంగాణ-మంథని

మంత్రి కమలాకర్‌కు జడ్పీ చైర్మన్ పుట్ట మధు శనివారం వినతి పత్రం అందజేశారు. రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వారికి టెక్నికల్ సమస్యతో బీసీ కుల వృత్తుల ఆర్థిక సాయం అందలేదు. ఈ సమస్యను పుట్ట మధు మంత్రి కమలాకర్‌కు దృష్టికి తీసుకెళ్లారు.

వెంటనే స్పందించిన మంత్రి గంగల కమలాకర్ వెంకట్రావుపల్లి గ్రామంలోని కులవత్తులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

యూట్యూబర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్

తెలంగాణ యూట్యూబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపకులు మంద భాస్కర్ యాదవ్, పసిలేటి సదయ్య తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా దామెర శంకర్, జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కంది సంపత్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సాదుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా నీలి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా మేకల శ్రీకాంత్ యాదవ్ లను ఎన్నుకున్నట్లు భాస్కర్, సదయ్య తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు

రేపట్నుండి అంగన్వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11 నుండి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత తెలిపారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్లను శనివారం సీఐటీయూ కార్యాలయంలో నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 11న మండల కేంద్రాలలో టెంట్లు వేసి సమ్మె చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు గర్భిణులు, పిల్లలకు పోషకాహారం అందించడంలో ముందున్నారన్నారు. గ్రామాలలో సర్వేలు రికార్డులు, అనేక పనులు చేస్తున్నారని అన్నారు. కానీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అందుకే ఈ నెల 11 నుండి సమ్మెకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం ఐదు లక్షలు చెల్లించాలని, సమ్మె నోటీసులో ఇతర డిమాండ్లన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి వెంకటమ్మ, కోశాధికారి రత్నమాల, అంగన్వాడి యూనియన్ ఆల్ ఇండియా సభ్యురాలు డి. సునీత, నాయకులు ముక్త, సుభద్ర, పంచశీల, పార్వతి, గంగమ్మ, మల్లుబాయి, పద్మ, మనీషా పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ భగీరథ కార్మికుల నిరసన

- కార్మికులకు కాంగ్రెస్, కార్మిక సంఘాల నాయకుల మద్దతు
- షోకాజ్ నోటీసుల ప్రతుల దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో భాగంగా 8వ రోజు జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు శ్యామ్‌నాయక్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దివాకర్, ఉపేందర్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు. ప్రైవేట్ యాజమాన్యాల చేతుల్లో వారి బతుకులు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భగీరథ ప్రాజెక్టుకు ఇచ్చిన కార్మికులకు ప్రాముఖ్యత ఇవ్వడం లేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, భగీరథ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరు లోకేష్ మాట్లాడుతూ సమస్య పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. యాజమాన్యాలు బెదిరింపులకు గురి చేస్తున్నాయని, వాటికి భయపడే ప్రసక్తి లేదన్నారు. అంబేద్కర్ చౌక్ వద్ద కార్మికులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు రాజేష్, ప్రేందాస్, రాహుల్, భీంరావ్, శ్రీనివాస్, రాందేవ్, సురేష్, బండు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- దేవాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



నవతెలంగాణ - కాసిపేట

ప్రజలకు పోలీస్ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. పోలీస్ అధికారులతో పోలీస్ స్టేషన్ వరిన రాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, 5సీ ఇంప్లిమెంటేషన్, ఫంక్షనల్ వర్టికల్స్, కోర్టు డ్యూటీ, రిసెప్షన్, బీసీ, పెట్రోల్ మొబైల్, టెక్ టీమ్స్ పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 కాల్ వచ్చినప్పుడు సంఘటన స్థలానికి వెళ్లడానికి పట్టే సమయాన్ని బ్లూ కోల్ట్స్ సిబ్బంది ట్యాబ్లో పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరు, నేరాలు నియంత్రణపై తీసుకుంటున్న చర్యలపై ఎస్ఎస్ఐని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత పోలీసులపై ఉందన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీసీ సదయ్య, సీఐ మహేందర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

13 మందికి ఆపరేషన్లు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో ఆపరేషన్లు అసరమైన 13 మందిని శనివారం ఆపరేషన్ నిమిత్తం బెల్లంపల్లికి తరలించారు. బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతులు తెలిపారు.

చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్ అప్రజాస్వామికమని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి.ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్మోహన్‌రెడ్డి కావాలనే చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాడని విమర్శించారు

ఘనంగా కాళోజీ జయంతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతిని శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్‌రావు, నారాయణ, మూర్తి, ఎల్లాగౌడ్, మురళీధర్‌రావు, దేవయ్య, తూడూరి ప్రకాష్, బంగారు బాబు పాల్గొన్నారు.

11న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-బెజ్జూర్

ఈనెల 11న మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎస్సై విక్రమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని యువకులు రక్తదానం శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా..

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు

నవతెలంగాణ-పెద్దపల్లి/నవతెలంగాణ-ముత్తారం

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ముత్తరం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన 50 మంది యువ ఓటర్లు పుట్ట మధుకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ మధు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ప్రజలు అన్ని రంగాల్లో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కుటుంబం అనేక సంవత్సరాలుగా అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఈసారి తనకు పార్టీ మరోసారి అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పీటీసీ చెల్కల స్వర్ణలత అశోక్, మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజిరెడ్డి, కేషన్‌పల్లి సర్పంచ్ నూనె కుమార్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రమణరెడ్డి, కమాన్పూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సమ్మయ్య ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

నవతెలంగాణ-ఓదెల

మండలంలోని పొత్కపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్(8) అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిలివేరి సాయికుమార్ ఇంటి ఎదుట రోడ్డుపై ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్రగాయాలైన సాయికుమార్‌ను స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

రూ.58 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం అభివృద్ధి కోసం మంత్రి కేటీఆర్ డీఎంఎఫ్‌టీ నిధులు 58 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు బీఎస్పీ రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు కాసిపేట స్వామి అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం ప్రాంతం నుంచి వేల కోట్ల రూపాయలు నిధులు తరలిస్తూ, తిరిగి ఈ ప్రాంతానికి కేవలం 58 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఏ ఏ అభివృద్ధి పనులకు కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ గోలివాడ ప్రసన్న కుమార్, అంతర్గాం మండల అధ్యక్షులు చిలుక రాంమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

అల్లూరులో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఛైటింక్లయిన్ కాలనీ

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ అల్లూరు గ్రామంలో దీప్తి మహిళా సమితి ఎన్టీపీసీ, రామగుండం వారి సహకారంతో అల్లూరులోని 100 మంది వృద్ధులకు శనివారం గ్రామంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాదె అంజలీదేవి మాట్లాడుతూ ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన అల్లూరుకు సంస్థ మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి ప్రెసిడెంట్ చిన్మయి దాస్, వైస్ ప్రెసిడెంట్ ఉర్జా దేశాయి, వెల్ఫేర్ ఇన్‌చార్జి పద్మశ్రీ వేముల, బాల భవన్ ఇన్‌చార్జి మంజులా రెడ్డి, జీఎస్ సుహాసిని, మంజులారావు, సూర్య ప్రభ కమిటీ మెంబర్స్, కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానము డైరెక్టర్ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.